# భారతదేశ ఆర్థికాభివృద్ధి

## స్వతంత్ర భారత పారిశ్రామిక విధానాలు

**స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి అనేది ప్రైవేట్ రంగానికి చెందిన అంశంగా భావించేవారు. రెండో పంచవర్ష ప్రణాళిక తర్వాత ప్రవేశపెట్టిన వివిధ పారిశ్రామిక విధాన తీర్మానాల్లో ప్రభుత్వరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామికాభివృద్ధిలో, పారిశ్రామికీకరణలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల స్థానం, వివిధ రకాల పరిశ్రమల పాత్ర, విదేశీ మూలధనం పాత్రను ప్రకటించే విధానాన్నే 'పారిశ్రామిక విధానం'గా పేర్కొనవచ్చు. పారిశ్రామిక విధాన తీర్మానాలు ఆర్థిక వ్యవస్థలో కీలక రంగాలైన వ్యవసాయం, దాని అనుబంధ రంగాలతోపాటు సేవల రంగాన్ని ప్రభావితం చేస్తాయి.**

పారిశ్రామిక అభివృద్ధి, వృద్ధిని నిర్ణయించే వివిధ రకాల నిబంధనలు, ప్రక్రియలను పారిశ్రామిక విధాన ప్రకటనలు, తీర్మానాలు తెలియజేస్తాయి. మారుతున్న పరిస్థితులు, అవసరాలు, ప్రపంచ స్థితిగతులు, ఇతర రంగాల ప్రభావం లాంటి అంశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త పారిశ్రామిక విధాన ప్రకటనలు, తీర్మానాలు చేయాల్సి ఉంటుంది.

### భారతదేశ పారిశ్రామిక విధాన ప్రధాన లక్ష్యాలు

★ జాతీయాదాయాన్ని శీఘ్రగతిన పెంచి ఆర్థికవృద్ధి, అభివృద్ధి సాధించడం.

★ ప్రజల జీవన ప్రమాణాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడం.

★ ఎగుమతుల ద్వారా దేశానికి విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించడం.

★ ఆర్థిక వ్యవస్థలో ఇతర ప్రధాన రంగాలైన వ్యవసాయం, అనుబంధ సేవారంగ పరిశ్రమలు, అవస్థాపనా, మౌలిక సదుపాయాలను పెంచడం.

★ ప్రణాళికా లక్ష్యాలైన స్వావలంబన, స్వయం సమృద్ధి సాధించడం.

★ దేశంలో వివిధ ప్రాంతాల మధ్య సంతులిత ప్రాంతీయాభివృద్ధి సాధించడం.

★ 'ఆర్థిక శక్తి' కేంద్రీకరణను నివారించడం లాంటి లక్ష్యాలను సాధించడానికి భారత ప్రభుత్వం చేసిన వివిధ పారిశ్రామిక విధాన తీర్మానాలు, ప్రకటనలను (Statements) కింది విధంగా పరిశీలించవచ్చు.

★ స్వాతంత్ర్యానికి పూర్వం మన సంప్రదాయ పరిశ్రమలు దెబ్బతినడం, ఆధునిక, పరిశ్రమలు అభివృద్ధి చెందక పోవడం ప్రధానంగా గమనించవచ్చు.

★ 1944 లో ప్రభుత్వం ప్రణాళికా, అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేసి 1945 ఏప్రిల్ 21న ఒక పారిశ్రామిక విధాన ప్రకటన చేసింది. ఈ ప్రకటన పరిశ్రమల అభివృద్ధి విషయంలో ప్రధానంగా ప్రభుత్వ జోక్య అవసరాన్ని ప్రస్తావించింది. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక విధాన తీర్మానాలు, ప్రకటనలు 'పారిశ్రామిక లైసెన్సింగ్' విధానానికి నాంది పలికాయి. 1950 లో ప్రణాళికా సంఘం ఏర్పాటుతో ప్రణాళికాబద్ధమైన పారిశ్రామికాభివృద్ధిని ప్రారంభించడానికి ప్రేరణ కలిగింది.

### మొదటి పారిశ్రామిక విధాన తీర్మానం

1948 ఏప్రిల్ 8న అప్పటి పరిశ్రమల మంత్రి శ్యాంప్రసాద్ ముఖర్జీ ఈ తీర్మానాన్ని ప్రకటించారు. ఇది భారతదేశ 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ' విధానాన్ని ప్రకటించింది.

★ పరిశ్రమలను ప్రధానంగా 4 వర్గాలుగా విభజించారు.

1) కేంద్రప్రభుత్వ ఏకస్వామ్యం ఉన్న సంస్థలు

2) రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉండే సంస్థలు

3) కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న సంస్థలు

4) ప్రైవేట్ రంగానికి, సహకార రంగానికి విడిచి పెట్టిన సంస్థలు.



R-7-12-16

## పారిశ్రామిక విధాన తీర్మానం, 1956

1956 ఏప్రిల్ 30 న ప్రకటించిన ఈ తీర్మానాన్ని ఆర్థిక రాజ్యాంగంగా అభివర్ణిస్తారు. దీని ప్రధాన ధ్యేయం 'సామ్యవాద రీతి సమాజ స్థాపన'. ఈ తీర్మానం మౌలిక, కీలక, భారీపరిశ్రమల వ్యూహానికి అనుగుణంగా (రెండో పంచవర్ష ప్రణాళికలో పేర్కొన్న) రూపుదిద్దుకుంది. పరిశ్రమలను 3 షెడ్యూళ్లుగా వర్గీకరించారు.

★ **షెడ్యూల్ A పరిశ్రమలు:** ఈ జాబితాలో 17 పరిశ్రమలను కేటాయించారు. వీటిలో ప్రధానంగా ఆయుధాలు - మందుగుండు సామగ్రి, అణుశక్తి, రైల్వేలు, విమాన రవాణా లాంటి పరిశ్రమలు మాత్రం ప్రభుత్వ ఏకస్వామ్యంలో పనిచేస్తాయి.

★ మిగిలిన 13 పరిశ్రమల్లో కొత్త సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. జవహర్‌లాల్ నెహ్రూ పరిశ్రమలను 'ఆధునిక భారత దేవాలయాలు'గా అభివర్ణించారు.

★ **షెడ్యూల్ B పరిశ్రమలు:** క్రమేణా ప్రభుత్వ యాజమాన్యం కిందికి వచ్చే పరిశ్రమలు. ఇందులో 12 పరిశ్రమలను చేర్చారు.

★ **షెడ్యూల్ C పరిశ్రమలు:** ప్రైవేట్ రంగానికి కేటాయించిన పరిశ్రమలు. షెడ్యూల్ A, B ల్లో పేర్కొనని పరిశ్రమలన్నీ ఈ జాబితాలోకి వస్తాయి. ప్రైవేట్ రంగానికి సహాయం చేయడానికి మాత్రమే ప్రభుత్వ పాత్ర పరిమితం.

★ ఈ పారిశ్రామిక విధాన తీర్మానంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పరస్పర సహకారానికి ప్రాధాన్యమిచ్చారు. అదే సమయంలో ప్రైవేట్‌రంగంపై అజమాయిషీని ప్రభుత్వం నిర్దేశిస్తుంది.

★ కుటీర, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం, సహకారం ఇవ్వడం, ప్రాంతీయ అసమానతలు తగ్గించడం, పారిశ్రామిక శాంతిని నెలకొల్పడం, విదేశీ మూలధనాన్ని ఆహ్వానించడం, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ, పర్యవేక్షణ, సాంకేతిక శిక్షణ, నిర్వహణ నైపుణ్యాల్లో శిక్షణ ఈ తీర్మానం ముఖ్య ఉద్దేశాలు.

★ 1956 పారిశ్రామిక విధాన తీర్మానానికి 1970, 1973, 1975 సంవత్సరాల్లో కొన్ని సవరణలు చేశారు. అయితే 1956 తీర్మానం లైసెన్స్ - కోటా - పర్మిట్ విధానాన్ని తీసుకొచ్చింది (లైసెన్స్ రాజ్ విధానం).

### 1970 పారిశ్రామిక విధానం - సవరణలు

1951 పారిశ్రామిక లైసెన్సింగ్ విధానంలోని లోపాలపై డాక్టర్ ఆర్.కె హజారీ కమిటీ ఒక నివేదికను సమర్పించింది. ఈ నివేదికపై 1967 లో నియమించిన డాక్టర్ ఎస్. దత్ కమిటీ 1969 లో తన నివేదికను అందజేసింది. దీని ఆధారంగా 1970 లో ఒక నూతన పారిశ్రామిక లైసెన్సింగ్ విధానం రూపొందింది.

★ **1973 విధానానికి చేసిన సవరణలు:** 1973 విధానంలో (core) కీలక పరిశ్రమల రంగంలో 19 పరిశ్రమలను చేర్చారు. 1956 పారిశ్రామిక తీర్మానంలో షెడ్యూల్ A జాబితాలో చేర్చిన పరిశ్రమలు చిన్న పరిశ్రమల రంగానికి రిజర్వ్ చేసిన పరిశ్రమలు తప్ప మిగిలిన అన్ని పరిశ్రమల్లో ఎవరైనా పాల్గొనవచ్చు.

★ **1975 విధానానికి చేసిన సవరణలు:** ప్రభుత్వం 21 పరిశ్రమలను లైసెన్స్ విధానం నుంచి మినహాయించింది. 30 పరిశ్రమలకు తమ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించడానికి అనుమతించింది.

### పారిశ్రామిక విధాన తీర్మానం, 1977

ఈ తీర్మానం గాంధీజీ - సామ్యవాద - గ్రామీణ విధానాలకు అనుగుణంగా 1977 డిసెంబరు 23 న తయారైంది. చిన్నతరహా పరిశ్రమలు మరీ ముఖ్యంగా సూక్ష్మ పరిశ్రమల (లక్ష రూపాయలకు మించని పెట్టుబడితో స్థాపించేవి) అభివృద్ధికి ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. 50 వేలకు మించని జనాభా ఉన్న పట్టణాల్లో వీటిని స్థాపించవచ్చు.

★ చిన్నతరహా పరిశ్రమలకు 10 లక్షల రూపాయల పెట్టుబడి పరిమితిని నిర్ధారించారు. చిన్న పరిశ్రమల రంగానికి రిజర్వ్ చేసిన వస్తువుల సంఖ్యను 180 నుంచి 807 కి పెంచారు.

★ జిల్లా పారిశ్రామిక కేంద్రాలను ప్రథమంగా ఏర్పాటు చేశారు (District Industries Center - DIC). ఖాదీ 'గ్రామీణ' చేతివృత్తుల పరిశ్రమల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించారు.

★ ఖాయిలా పరిశ్రమలపై విధానం ప్రకటించటం, శ్రామిక సంబంధాలను మెరుగుపరచడం దీని ఉద్దేశం.

## పారిశ్రామిక విధాన తీర్మానం, 1980

1980 జులై 3 న ప్రవేశ పెట్టిన ఈ తీర్మానం ముఖ్య ఉద్దేశాలు: ప్రభుత్వరంగ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం, ప్రైవేట్

రంగంతో సమైక్యతను పెంపొందించుకుని, ఆర్థిక సమాఖ్యను సాధించడం.

★ చిన్న పరిశ్రమల పెట్టుబడులను కింది విధంగా పునర్వ్యవస్థీకరించి, న్యూక్లియస్ సంస్థల ఏర్పాటుకు తీర్మానం చేశారు.

i) సూక్ష్మ (tiny) పరిశ్రమల పెట్టుబడి పరిమితిని రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు పెంచడం.

ii) చిన్న పరిశ్రమల పెట్టుబడి పరిమితిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడం.

iii) అనుబంధ పరిశ్రమల పెట్టుబడి పరిమితిని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడం.

★ ఖాయిలా పరిశ్రమల విలీనాన్ని ప్రోత్సహించడం.

## నూతన పారిశ్రామిక విధాన తీర్మానం

ఈ తీర్మానాన్ని 1991 జులై 24 న ప్రవేశపెట్టారు. పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని రద్దుచేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఇతర అంశాలు...

★ అత్యధిక ప్రాధాన్యం ఉన్న రంగాల్లో 51% వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అనుమతించడం.

★ ఏకస్వామ్యాలు, వ్యాపార నిరోధ చట్టం (MRTP ACT) ప్రకారం 1985 నుంచి ఉన్న 100 కోట్ల పరిమితిని ఎత్తివేశారు. ఖాయిలా పడ్డ పరిశ్రమలను BIFR (Board for Industrial Financial Reconstruction) కు నివేదించడం.

★ ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అంటే పెట్టుబడులను ఉపసంహరించడం.

### మార్పులు..

1991 తీర్మానంలో ప్రభుత్వ రంగానికి రిజర్వ్ చేసిన 8 పరిశ్రమలను 3 పరిశ్రమలకు పరిమితం చేశారు. అవి: 1) అణుశక్తి, 2) రైల్వే రవాణా, 3) రక్షణ ఆయుధాలు, అణుశక్తి ముడి ఖనిజాలకు సంబంధించి కేంద్రం నోటిఫై చేసిన ఖనిజాలు.

★ 1991 తీర్మానం ద్వారా తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సిన 18 పరిశ్రమలను 5 పరిశ్రమలకు పరిమితం చేశారు. అవి: 1) మద్యం ఉత్పత్తులు, 2) పొగాకు ఉత్పత్తులు, 3) ఎలక్ట్రానిక్, ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తులు, 4) పారిశ్రామిక explosives, అగ్గిపెట్టెలు, 5) హానికారక రసాయనాలు.

★ చిన్న పరిశ్రమల రంగానికి రిజర్వ్ చేసిన వస్తువుల సంఖ్య 1998 - 99 నాటికి 812 కి పరిమితం చేశారు.

★ కొన్ని పరిశ్రమల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 26% నుంచి 100% వరకు అనుమతిచ్చారు. ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కింద పేర్కొన్న 4 రంగాల్లో తప్పించి మిగతా అన్ని రంగాల్లో 100% అనుమతిస్తున్నారు.

★ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించని రంగాలు: రిటైల్ వ్యాపారం (ఏక బ్రాండ్ ఉత్పత్తి రిటైల్ తప్పించి), అణుశక్తి, లాటరీ వ్యాపారం, జూదం, బెట్టింగులు.

## మాదిరి ప్రశ్నలు

**1.** స్వాతంత్ర్యానికి పూర్వం 1944 లో ప్రణాళికా, అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఏ సంవత్సరంలో పారిశ్రామిక విధాన ప్రకటన జారీ చేసింది?

1) 1943 జనవరి 21    2) 1944 ఫిబ్రవరి 21    3) 1945 ఏప్రిల్ 21    4) 1946 మార్చి 21

**2.** స్వాతంత్ర్యానంతరం 1948 ఏప్రిల్ 6 న భారత ప్రభుత్వ తొలి పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించిన పరిశ్రమల మంత్రి ఎవరు?

1) శ్యామాప్రసాద్ ముఖర్జీ    2) ప్రొ. పి.సి. మహలనోబిస్

3) ప్రొ. వి.కె.ఆర్.వి. రావు    4) డి.ఆర్. గాడ్గిల్

**3.** 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ'ను ప్రతిబింబించిన పారిశ్రామిక విధాన తీర్మానం ఏది?

1) 1948 పారిశ్రామిక విధాన తీర్మానం    2) 1956 పారిశ్రామిక విధాన తీర్మానం

3) 1973 పారిశ్రామిక విధాన తీర్మానం    4) 1977 పారిశ్రామిక విధాన ప్రకటన

**4.** 1948 పారిశ్రామిక విధాన తీర్మానం ద్వారా పరిశ్రమలను ఎన్ని విభాగాలుగా వర్గీకరించారు?

1) 2    2) 3    3) 4    4) 5

**5.** ఏ పారిశ్రామిక తీర్మానాన్ని ఆర్థిక రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?

1) 1948 పారిశ్రామిక తీర్మానం
2) 1956 పారిశ్రామిక తీర్మానం
3) 1980 పారిశ్రామిక తీర్మానం
4) 1991 నూతన పారిశ్రామిక తీర్మానం

**6.** 1956 పారిశ్రామిక విధాన తీర్మానంలో పరిశ్రమలను ఎన్ని షెడ్యూల్స్‌గా వర్గీకరించారు?

1) 2
2) 3
3) 4
4) 5

**7.** 1956 పారిశ్రామిక విధాన తీర్మానం సందర్భంగా పరిశ్రమలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిందెవరు?

1) సర్దార్ వల్లభాయ్ పటేల్
2) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
3) బాబూ రాజేంద్రప్రసాద్
4) జవహర్‌లాల్ నెహ్రూ

**8.** 1956 పారిశ్రామిక విధాన తీర్మానం ద్వారా షెడ్యూల్ A జాబితాలో చేర్చిన పరిశ్రమల సంఖ్య?

1) 17
2) 18
3) 19
4) 20

**9.** లైసెన్స్ - కోటా - పర్మిట్ (లైసెన్స్‌రాజ్) విధానాన్ని ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధాన తీర్మానం ఏది?

1) 1948 తీర్మానం
2) 1956 తీర్మానం
3) 1977 తీర్మానం
4) 1980 తీర్మానం

**10.** 1951 పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని, దానిలోని లోపాలను పరిశీలించడానికి నియమించిన కమిటీ?

1) ఎస్. దత్ కమిటీ
2) డా. ఆర్.కె హజారీ కమిటీ
3) మోక్షగుండం విశ్వేశ్వరయ్య కమిటీ
4) ప్రొ. వి.కె.ఆర్.వి రావు కమిటీ

**11.** జిల్లా పారిశ్రామిక కేంద్రాలను ఏ పారిశ్రామిక విధాన తీర్మానం ద్వారా మొదట ఏర్పాటు చేశారు?

1) 1977 పారిశ్రామిక విధాన ప్రకటన
2) 1980 పారిశ్రామిక విధాన తీర్మానం
3) 1991 నూతన పారిశ్రామిక విధాన తీర్మానం
4) 1948 పారిశ్రామిక విధాన తీర్మానం

**12.** 1977 పారిశ్రామిక విధాన ప్రకటనలో చిన్నతరహా పరిశ్రమలకు పెట్టుబడి పరిమితి ఎంత విధించారు?

1) రూ. 10 లక్షలు
2) రూ. 15 లక్షలు
3) రూ. 20 లక్షలు
4) రూ. 25 లక్షలు

**జవాబులు**

1-3; 2-1; 3-1; 4-3; 5-2; 6-2; 7-4; 8-1; 9-2 ; 10-2; 11-1; 12-1

**- దాడి నరేన్**